
# రాలిన చుక్కలు

## డా. టి. సంపత్ కుమార్

పొద్దున్నే లేచి ఇంటి పనంతా చకచకా చేసుకొని అనుకున్న సమయానికే తయారయ్యింది శారద. ఒక్కొక్క పనిని పూర్తిచేస్తుంటే ఏదో సాధించానన్న తృప్తి. ఉద్యోగరీత్యా భర్త రామకృష్ణ దూరంగా వుండడంవల్ల పనులు–బాధ్యతలు ఎంతో పెరిగిపోయినా ఓర్పుగా నేర్పుగా సమర్థవంతంగా రోజుల్ని నెట్టుకొస్తుంది. ఎప్పుడొస్తాయో ఏమోకాని భర్తతో కలిసి వుండే సంసారపు రోజుల కోసం ఆశతో ఎదురు చూస్తోంది!

శారద తల్లై మూన్నెల్లు కావస్తుంది. పాప రాకతో శారదకు ఇంట్లో ఒంటరితనం పోయింది. అలసటంతా పాప బోసినవ్వుతో మటుమాయమవుతుంది. ఇంటర్ వరకు చదువుకున్న శారదకు మంచి పుస్తకాలు చదవడం బాగా అలవాటు. కడుపు పండిందని తెలిసినప్పటి నుంచి పుష్టికరమైన ఆహారం, విశ్రాంతి మొదలుకొని టీకాల అవసరాలు, పిల్లల పెంపకం వరకు సంబంధించిన పుస్తకాలను చదివింది. రామకృష్ణ శారద అభిరుచిని గ్రహించి అడపాదడపా పుస్తకాలను పోస్టులో పంపుతుంటాడు. వీలయినంతలో తనకు తోచిన వాటిని పాటించి తగు జాగ్రత్తలు తీసుకొనేది. వీటన్నిటివల్లనేమో శారద, పాపకు ఎలాటి చెప్పుకోదగ్గ సమస్యలు కలుగలేదు.

కావలసినవాటిని సర్దుకొని ఇంటికి తాళం వేసి పాపను భుజాన వేసుకొని బయలుదేరింది. రెండు కిలోమీటర్లు నడిచి మరో వూరు వెళితే కాని బస్సు దొరకదు. శారద వుండే వూరికదే దగ్గరి బస్టాపు. పెద్ద పెద్ద అంగలు వేస్తూ నడుస్తోంది. అపుడపుడు చేతి గడియారం వైపు చూసుకుంటూ నడక వేగాన్ని పెంచుతూ పోతోంది. అడ్డంగా ఆనించిన ఓ చేతిలో బ్యాగ్, దాంట్లో పాపకు సంబంధించిన సామాన్లు బట్టలున్నాయి. మరో చేతిని, భుజంపై నిద్రలోనున్న పాపను చుట్టి వుంచింది. వూరు దాటి పొలిమేరల్ని కాళ్లతో వెనక్కు నెట్టేసుకుంటూ స్పీడుతో నడుస్తుంది. అపుడపుడు సౌకర్యం కోసం పాపను భుజం మారుస్తుంది. మార్చినపుడల్లా టైం



చూసుకుంటుంది. చుట్టుపక్కలున్న అడవంతా అదృశ్యమవడంతో దాదాపు కిలోమీటరు దూరం నుచే దూసుకాస్తున్న ఓ వాహన మగుపడింది. ఎర్ర బస్‌ను స్పష్టంగా గుర్తించాక శారద నడక వేగాన్ని మరింత పెంచింది. దృష్టిని కదలుతున్న బస్‌పైనే కేంద్రీకరించి వడివడిగా పరిగెత్తినంత పని చేసింది. స్టాండుకు చేరిందో లేదో మనుషుల్తో బాలెన్స్ చేసుకుంటూ బస్ వచ్చి సుస్తీగా ఆగింది.

ఆ వూళ్ళో అదే రోజు అంగడి కావడంతో బస్ సిటీబస్‌లా నిండివుంది. జనం కాలు మోపేందుకు స్థలాన్నాక్రమించుకునే ప్రయాస పడుతున్నారు. శరీరాల్ని కదిలించుకుంటూ దొరికిన స్థలంలోనే కుదించుకుంటున్నారు. గారడివాడు చిన్న రింగులో నుండి శరీరాన్నంత ఎలా దూరించగలడో ఆ బస్‌లోని ప్రయాణీకులందరూ చేయగలరేమోననిపిస్తుంది, వారు స్థలాన్ని ఏర్పరచుకుంటున్న రీతిని చూస్తుంటే! ప్రతి స్టాపులో ఎక్కేవారిని తీసుకుంటూ అందరికీ మునివేళ్ళు మోపే స్థలాన్ని అందిస్తున్న ఆ బస్‌ను 'పుష్పకబస్' అంటే సరిపోతుందేమో! శారద కూడా పాపను భుజంపై అదిమి పట్టుకుని అతికష్టంగా బస్‌లోకి ఎలాగో ప్రవేశించింది. చేతిలోని సంచిని కూర్చున్న ఓ ప్రయాణీకుని కందించి నిలదొక్కుకునే ప్రయత్నం చేసింది. "పిల్ల తల్లికి ఎవల్లన్న సేటియ్యండ్రి" అని అన్న ఓ ముసలి పౌరురాలి మాటలు బస్సు రోదనలో ఎవరికి వినిపించలేదు.

ఎగుడుదిగుడుల కదలికలతో బయ్‌మంటూ రోత కలిగించే హారన్ శబ్దం. ఒకరిపై మరొకరు ఒరిగిపోతూ అసహాయ స్థితిలో ఒత్తుకుంటున్న స్థితి. కొందరు కునుకు తీస్తుంటే మరి కొందరు నిద్ర నుండి మెలకువ లోకంలోకి జారుకుంటున్నారు. తోటి ప్రయాణీకులుగా అవుడవుడు మేకల మేమేలు, కోళ్ళ కొక్కొరోకోలు. పాప జడుసుకొని ఒక్కసారే కెవ్వుమంది. అందరూ చూసి జాలిపడేవారే కాని కూర్చున్న వారు లేచి సీటు ఇచ్చే సభ్యతకు కాని సంవేదనాశీలతకు కాని ఇంకా ఎదగలేదు. హృదయాలు సున్నితత్వానికి మోటుపడిపోయాయి. డ్రైవర్ ఎవరితోనో బాగా సుత్తి వేస్తున్నాడు. కండక్టర్ చిట్టెలుకలా దూరుకుంటూ అంగుళం చొప్పున ముందుకు కదులుతూ చేతుల్ని చకచకా ఆడిస్తున్నాడు. "పక్కకు జరుగు, పక్కకు జరుగు" అంటూ ప్రేమతో ప్రయాణీకుల్ని మందలిస్తూ, ఓర్పు నశించినపుడు కోప్పడుకుంటూ తోలు సంచిలో చిల్లర చప్పుడు చేస్తున్నా టిక్కెట్ల వెనకాల బాలెన్స్ రాసుకుంటూ 'పురోగమిస్తున్నాడు.' గతుకుల రోడ్డు నుండి బయటపడ్డ బస్ సాఫీగా సాగుతుంది. శారద కుడి చేయి రూఫ్ టాప్ బార్ నుండి వేలాడుతున్న హోల్డర్‌ను గట్టిగా పట్టుకోగలిగింది. ఊగిపోతున్న శారద భుజంపై పాప నిద్రపోతోంది.

గంట ప్రయాణం తరువాత బస్ తన గమ్యస్థానానికి చేరుకుంది. బస్‌లో ఎక్కడమొక సమస్యయితే దిగడమొక సమస్య. అంతవరకు బుద్ధిగా వున్న ప్రయాణీకులు ఏదో అదృశ్య శక్తి తరుముకొస్తున్నట్టుగా ఒకర్నొకరు తోసుకుంటూ పోటీపడి బయటపడుతున్నారు. శారదకు ఆ విషయం అనుభవం ద్వారా బాగా తెలుసు కావున పాపను భద్రంగా పట్టుకొని డ్రైవర్ సీటు వెనకాలే ఓ మూలన అంతా గమనిస్తూ నిలుచుంది. కొంత సమయం నష్టపోతున్నానని మనస్సులో పీకుతున్నా ఆ స్థితిలో అచేతనంగా, శిలలా బస్ ఖాళీ అయ్యేంత వరకు ఎదురుచూసింది.

బస్ దిగుతూనే శారద రిక్షాలో నేరుగా ఆ టౌన్‌లోవున్న గవర్నమెంట్ హాస్పిటల్‌కు చేరుకుంది. రిక్షా దిగుతూనే మహాసర్పంలా రూపం పోసుకున్న క్యూను చూసి నిరుత్సాహంతో డస్సిపోయింది. రిక్షాకు డబ్బు చెల్లించి పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ తాను క్యూలో చేరి తృప్తిగా శ్వాస పీల్చుకుంది.

పోలియో డ్రాప్స్ వేయించడానికి వచ్చిన తల్లిదండ్రులతో ఆ హాస్పిటల్ వరండా కిటకిటలాడిపోతోంది. పిల్లల ఏడ్పులతో, తల్లుల వూరడింపులతో, హాస్పిటల్ స్టాఫ్ మందలింపులతో, కాలయాపనకు సాగిస్తున్న ముచ్చట్లతో సందడి సందడిగా వుంది. క్యూలో నిల్చొని చుట్టుప్రక్కల్ని గమనిస్తున్న శారదకు అక్కడి వాతావరణం మనస్సును కొంత కదిలించింది. కొందరు తల్లులు తమ భర్తలతో సహావచ్చారు. భార్యలకు చిన్నచిన్న పనుల్లో తోడ్పడుతూ పిల్లల్ని మధ్య మధ్యలో ఎత్తుకుని వరండాలో పచార్లు చేస్తుంటే శారదకు భర్త రామకృష్ణ గుర్తొచ్చి కళ్ళు చెమ్మగిల్లాయి. ఉద్యోగరీత్యా ఇంటికి దూరంగా వుంటున్న రామకృష్ణ ఇమ్యునైజేషన్ గురించి పదే పదే చెప్పిన విషయం అదే పనిగా జ్ఞాపకానికొస్తోంది. శారదకు ఈ విషయాలన్నీ తెలిసినా భర్త ఎంతో బాధ్యతా పూర్వకంగా చెప్పిపోవడం చాలా సంతోషాన్ని కలిగించింది. ప్రతి వుత్తరంలో ఇమ్యునైజేషన్ గురించి ప్రస్తావన తెచ్చేవాడు.

ఆలోచనల్ని భంగపరుస్తూ ఒక్కసారే శారద దృష్టి ఓ తల్లి చుట్టు తిరుగుతున్న బాబు కాళ్ళపై పడింది. ఆ బాబు దడిచే తీరు, కాళ్ళను చూస్తుంటే శారదకు వెన్నులోంచి వణుకుపుట్టి వళ్ళంతా జలదరించినట్టయింది. "నా పాపకిలాకావద్దు. నా పాపకిలాకావద్దు..." అని మనస్సులో ప్రతిధ్వనిస్తుంటే అసంకల్పితంగా తన చేతులు పాపను గట్టిగా హృదయానికి హత్తుకున్నాయి. తన పాపకు కాళ్ళు వంకర్లు పోవని, తాను కోరుకున్న తీరుగా కూచిపూడి నాట్యంలో ప్రవీణురాలిని చేయగలనన్న ధీమా వచ్చింది. కాళ్ళు వంకర్లు పోకుండా చేసే డ్రాప్స్ కొంత సేపట్లో పాప నోట్లో పడతాయన్న ఘడియ గుర్తుకొచ్చి తనువంతా వింత అనుభూతితో పులకరించింది. ఈ ఆలోచనల్లో, భారంగా క్యూలో మీటరుకు పైగానే ముందుకు కదిలింది. నత్తనడకలా కదులుతున్న క్యూను చూస్తుంటే నిరుత్సాహమనిపించినా, పాపను ఓ వికృతమైన రూపం నుంచి రక్షించుకుంటున్నానన్న సంతోషపు పాలే అధికంగా వుంది శారదకు. సెకన్లముల్లు తనకేమీ పట్టనట్టుగా వర్తమానాన్ని భూతకాలంగా, భవిష్యత్తుని వర్తమాన కాలంగా కళ్ళముందే చకచగా మార్చేస్తుంది. మధ్యాహ్నం మూడు గంటలకు తిరిగి తన వూరు చేరుకోడానికి చివరి బస్సు వుంది. ఎలా

## సాధ్యం-తథ్యం



చింతన చిరుదీపానికి
సంఘర్షణ చమురందిస్తే
సమస్యల చీకటి వలయంలో
వివేకమే వెలుగువెల్లువ

ఆవేశపు వేసవిలో
ఆత్మవిమర్శ వర్షిస్తే
నైరాశ్యపు ఎడారిభూమిలో
అనుభవాలే ఆమని పిలుపులు
అవసరానికి అనుకూలంగా
అవకాశాన్నాహ్వానిస్తే
ఆశయానికనుగుణ్యంగా
ఆవేశాన్నాశ్వాశిస్తే
నభోమండల నక్షత్రాలను
నేలకూల్చడం సాధ్యమే
అవని అంచులు అంబరాన్ని
అధిగమించడం తథ్యమే.

— పి.రఘువీరాణి

---

- విద్య శరీరానికి వ్యాయామం వంటిది — ప్లేటో
- చచ్చి పోయేదాక ఎవరినీ అతడు సుఖంగా వున్నాడని అనకు ..ఏసుక్రీస్తు

---

## భాస్కరుడు – పూర్ణచంద్రుడు

సెప్టెంబర్10న పద్యకవితా సదస్సు ఎలా నిర్వహించాలా అని అనుకుంటూ సహజ కవితా సరస్వతి, రవాణా బంధు జిల్లేపల్లి భాస్కరరావు గారు,అవధాన సరస్వతి, కావూరి పూర్ణచంద్ర రావుగారు, నండూరి కృష్ణమాచారిగారు తదితర సాహితీవేత్తల సమావేశమయ్యాము భాస్కరరావు గారి ఆఫీసు గదిలో. ఆ సమయంలో భాస్కరరావుగారు పూర్ణచంద్రరావుగారితో 'మీరులేనిదే కవితా సదస్సు నందనవనం శోభిల్లదు ఎంతైనా పూర్ణచంద్రాలుకదా' అని చమత్కరించారు.

అవధాన సరస్వతి వెంటనే "ఎంత పూర్ణచంద్రులైనా భాస్కర కిరణాలులేనిదే ప్రకాశం రాదుకదా!" 'అంటూ త్రిప్పికొట్టారు.

అందరూ నవ్వుల వెల్లువలో తేలియాడారు.

– కొలచన వెంకట రమణమూర్తి



గైనా ఆ బస్సులో ఇంటికి చేరుకోవాలి. క్యూ నత్త నడకలానే సాగుతోంది. కాలం కదలుతూనే వుంది. రెండు గమనాల్లో ఎంతో వ్యత్యాసముంది!

శారదకు ముందు ఇంకో నలుగురు తల్లులున్నారు. అందరి మనసుల్లో ఆ అద్భుతపు మందు చుక్కలు ఎప్పుడు నోట్లో పడతాయోనన్న ఆశ, ఆత్రుతలు ప్రస్ఫుటంగా కనబడుతున్నాయి. అదిగో సరిగా అపుడే స్టాఫ్ టీ తీసుకోడానికి బయలుదేరారు. తల్లులంతా వుస్సురుమన్నారు. అవేమి పట్టించుకోలేని స్థితిలో స్టాఫ్ లేదు. అదివారికి మామూలే! శారద మళ్ళీ ఒకసారి వాచి, వంక చూసింది. అలా పొద్దుటి నుంచి వాచిని ఎన్నిసార్లు చూసుకుందో?

టీ తాగిన బాపతు తాజాదనంతో స్టాఫ్ తీరిగ్గా వచ్చి మళ్ళీ డ్రాప్స్ వేయడం మొదలుపెట్టారు. తన పాపకేక కాళ్ళు వంకర పోవు. చక్కగా నడవగలదు. పరుగెత్తగలదు. డాన్స్ నేర్చుకుంటుంది. కాలిగజ్జల చప్పుడు తానిక తప్పక వింటుంది. డ్రాప్స్ వేయించగానే భర్తకు తెలుపుతూ వెంటనే వుత్తరం రాయాలి. తన వుత్తరం కోసం ముఖ్యంగా ఈ విషయం కొరకు రామకృష్ణ ఎదురు చూస్తుంటాడు. మనసంతా ఈ ఆలోచనలే ముసురుకొంటున్నాయి. "వెంటనే రాయాలి" అని మళ్ళీ ఓసారి అనుకుంది. భుజంపై పాప నిద్రపోతోంది.

అబ్బ! ఇంకొక తల్లివుంది తనకు ముందు. క్యూలో నిల్చున్నంతలో ఒక్కో పాపకు డ్రాప్స్ వేయడానికి ఎంత టైం పడుతుందో శారద ఈ పాటికి బాగా అర్థం చేసుకుంది. వాచీ వంక మరోసారి చూసుకుంది. పాప నోట్లో డ్రాప్స్ పడగానే రిక్షాలో వెంటనే బయలుదేరి బస్‌స్టాండు చేరుకోవాలి. ఒక్క నిమిషం కూడా వ్యర్థం కాకుండా చూసుకుంటేగాని కుదరదు.

తనవంతు రానే వచ్చింది. అప్పటికే పాపను కదిలి నిద్రలోంచి లేపింది. చిత్రమైన శబ్దాన్ని నోటితోచేస్తూ హుషారు లోకంలోకి తేవడానికి ప్రయత్నిస్తుంది. రెండు చెతుల్లో పాపను అడ్డంగా పట్టుకొని మెల్లగా పైకి, కిందకు, ప్రక్కలకు వూపింది. పాపకాళ్ళు, చేతుల్ని చురుకుగా కదల్చుతోంది. కాళ్ళకున్న వెండి పట్టాల చిరుగజ్జెల చప్పుడు పెరిగి సిరిసిరి మువ్వలై స్టేజీపై రాజ్యమేలాలి అని మనస్సులో కోరుకుంది శారద.

పాపను అనువుగా పట్టుకుంటే సిస్టర్ పాప బుగ్గల్ని ప్రక్కల నుంచి మోటుగా ప్రెస్ చేసింది. శారద హృదయం జివ్వుమంది. పాపనోరు నిలువునా తెరచుకుంది. చేంతాడులాంటి క్యూ చకచకా ముందుకు సాగాలంటే స్టాఫ్ ప్రవర్తన కొంచెం కటువుగా వుంటుంది.

అందులో గవర్నమెంట్ హాస్పిటల్లో మరీనూ. సిస్టర్ డ్రాపర్‌తో సూటిగా పాప నోట్లో పడేట్టుగా పోలియో డ్రాప్స్ వదిలింది. ఆ క్షణం కొరకే ఎంతో వుత్కంఠతో ఎదురు చూస్తూన్న శారద ముఖంలో ఆనందం తాండవమాడింది. ఆ మాతృమూర్తి సంతోషం ఇంతింతనలేము! పొద్దుటి నుంచి పడ్డ అవస్థలు, అలసటంతా అదృశ్యమై కొత్త శక్తి శరీరమంతా నిండుకున్నట్టయింది. తనకిపుడు పూర్తి భరోసా ఏర్పడింది. పాప కాళ్ళు వంకర్లు పోవిక. అంతకు మునుపు చూసిన బాబులా తన పాప నడవదు. చక్కగా నడుస్తుంది. అందరి సానుభూతికి గురికాదు. గజ్జెకట్టి డ్యాన్స్ చేస్తుంది. తన కోరిక తప్పక నెరవేరుతుంది. స్టేజి అదిరిపోయేలా డ్యాన్స్ చేస్తుంటే తాను, తన భర్త ముందు వరుసలో కూర్చుని చూస్తారు. ఆ స్థాయికి పాపను తీసుకెళ్ళడానికి తాను ఎన్ని కష్టాలైనా భరిస్తుంది. "తన కోరిక తప్పక నెరవేరుతుంది" అన్న వాక్యమే మనస్సులో తదేకంగా రిపీట్ అవుతుంది. "నడువమ్మ నడు" అన్న సిస్టర్ మాటలతో లోకంలోకి వచ్చిన శారద అడుగులు ముందుకేసింది.

రిక్షాలో బస్‌స్టాండ్ చేరుకునేసరికి బస్ నీరసంగా కనబడింది. అప్పటికే జనం సీట్లపై కూచోని తీరిగ్గా ముచ్చట పెడుతున్నారు. మరి కొందరు సామాన్లు నిండిన సంచులతో, పంచలతో సీట్లను 'రిజర్వు' చేసుకుని బయట కబుర్లు చెప్పకుంటున్నారు. డ్రైవర్ బస్ క్రింద వెల్లకిలా పడుకుని ఏవోనట్లు బిగిస్తున్నాడు. కండక్టర్ తోలుబ్యాగ్‌ను బద్ధంగా చంకలో ఇరికించుకుని కాళ్లపై కూచోని డ్రైవర్‌కు కావలసినవల్లా అందిస్తున్నాడు. శారద బస్ ఎక్కి అన్ని వైపులా ఆశతో పరికించి చూసింది. సీట్లన్నీ 'ఆక్రమించుకోబడి' వున్నాయి. ఎక్కడా ఖాళీ సీటు కనబడపోయేసరికి ఉస్సూరుమంటూ మళ్లీ ఓసారి బస్‌లో వున్నవారిని, తెలిసిన వారెవరైనా కనబడతారేమోనని పరీక్షగా చూడ్డం మొదలుపెట్టింది. సరిగ్గా అదే సమయంలో అదృష్టం కొద్దీ ఓ ముసలావిడ మసక చూపుతోనైనా గుర్తుపట్టి "ఓ శారదమ్మా! గిట్లరా. ఇటచ్చి కూకుండు" అంటూ పక్కనున్న మనమణ్ణి ఒళ్లో కూచోపెట్టుకుని స్థలం ఏర్పరచింది. కృతజ్ఞతా భావంతో వెళ్లి మెల్లగా ముసలావిడ పక్కన కూర్చుంది శారద.

ముసలావిడ ఇల్లు శారద ఇంటికి సుమారుగా ఓ పది ఇళ్లవతల వుంటుంది. కొడుకు గల్ఫ్ నుండి ఉత్తరం వచ్చినప్పడల్లా శారద దగ్గరికొచ్చి చదివించు కుంటుంది. జవాబులను కూడా శారదతోనే రాయిస్తుంది. అందుకే శారదకు ఆమె ఇంటి విషయాలు బాగా తెలుసు.

"ఏం అవ్వా! బాగ రోజుల్నుంచి కనవడ్తలేవు. కొడుకునుంచి ఉత్తరాలస్తలేవా ఏంది?" అని అడిగింది శారద. ముసలమ్మతో ఎప్పుడూ ఇదే యాసలోనే మాట్లాతుంది శారద. అందుకోసమే ముసలమ్మ శారదను ఆప్తురాలిగా భావిస్తుంది. అన్ని విషయాలను శారదతో చెప్పకుంటుంది. "అవునమ్మ! ఎల్లుండొచ్చే పున్నమకు బరాబర్ నెలయితది. శానరోజులాయె. ఏదన్న పని చేతిమీదుందేమో. రికామి దొరుకుతలేదేమో, ఇంకో నాలుగయిదు రోజులు చూసి మనం ఓ చిట్టి రాద్దమమ్మ" విచారంతో, భారమైన కంఠంతో అంది ముసలమ్మ. "మంచిది. తీరిక చేసుకుని రా, చిట్టి రాద్దాం" అని అంటుండగా డ్రైవర్ తన సీటుపైకి నెమ్మదిగా చేరుకుని ఏవో రెండు వైర్లను అంటించి ఇంజన్ను గుర్ గుర్ మనిపించాడు. శబ్దం విని బయటున్న వారంతా బిరబిరా బస్‌లోకి రేస్‌లా దూరారు. శబ్దం చేసిన ఇంజన్ ఠక్కున ఆగిపోయింది. డ్రైవర్ మళ్లీ వైర్లను అంటించి గుర్ గుర్‌మనిపించి,

---

దేవమానం ప్రకారం తులా సంక్రమణం జరిగినప్పటి నుంచి దేవతలకు రాత్రి మొదలవుతుంది. ఆ సమయాన చీకటి, చలి అధికంగా వుంటుంది. అందు చేత పితృదేవతల్ని నరక విముక్తులను చేసి పుణ్యలోకాలకు పంపడం కోసమే దీపాలు, దివిటీలు వెలిగిస్తుంటారు. - సిహెచ్.లక్ష్మి

కండక్టర్‌ను కేకేసి బస్‌ను ఒక్క కుదుపుతో ముందుకు కదిలించాడు. ప్రయాణికులు ముందుకు తూలి పడబోయి మళ్లీ ఎవరి స్థలాల్లో వారు సర్దుకున్నారు. శారద ఒళ్లో పాప హాయిగా నిద్రపోతుంది. ఇంటికి చేరాక వెంటనే పోలియో డ్రాప్స్ వేయించినట్టు భర్తకు తెలుపుతూ ఉత్తరం రాయాలన్న తీపి ఆలోచనలు కమ్ముకున్నాయి.

* * *

పోలియో డ్రాప్స్ రెండవ డోస్ కొరకు ఓ రోజు మళ్లీ శారద పొద్దున్నే లేచి ఇంటిపనంతా చకచకా చేసుకుని అనుకున్న సమయానికే రెడి అయ్యింది.

బస్సుకోసం పరుగెత్తింది...

బస్సులో నిల్చోనే ప్రయాణం చేసింది...

హనుమంతుడి తోకలా వున్న క్యూలో నిల్చుంది...

రెండవ డోసు పాపకు వేయించానని రామకృష్ణకు ఉత్తరంలో రాసింది.

* * *

మూడవ డోసు కొరకు పొద్దునే లేచి ఇంటిపనంతా చకచకా చేసుకుంది. బస్‌స్టాండ్‌కు ముందుగానే చేరుకున్న బస్సు ఆ రోజు గంటన్నర ఆలస్యంగా వచ్చింది.

కాస్త బరువు పెంచుకున్న పాపనెత్తుకుని బస్సులో నిల్చోనే ప్రయాణం చేసింది. క్యూలో నిల్చుంది. మూడవ డోసు వేయించి "హమ్మయ్య!" అనుకుని పాప ప్రఖ్యాత డ్యాన్సరో, పరుగుల రాణియో అయినంత సంతోషించింది.

రామకృష్ణకు రాసిన ఉత్తరంలో మూడు డోసులు పూర్తయ్యాయని ఎంతో సంతోషంతో తెలిపింది.

* * *

పార్లమెంట్ సమావేశం మొదలయింది. ఆరోజటి చర్చలకు ఎంపీలు మెల్లమెల్లగా చేరుకుంటూ తమతమ సీట్లలో కూచున్నారు. చాలామంది ఎంపీల చేతుల్లో ఆరోజటి ఒక దినపత్రిక కాపీలున్నాయి. సాక్ష్యాధారాలతో ఒక భయానక సత్యాన్ని ఇన్వెస్టిగేట్ చేసి ప్రచురించిన కథనం ఆ దినపత్రిక మొదటి పేజీలో వుంది.


సమావేశం ఆరంభమవుతూనే 'రాజకీయకులు' విరుచుకుపడ్డారు... కల్లోలం తప్పింది... అదుపులోకి తెచ్చేందుకు సమావేశాన్ని రెండుసార్లు అడ్జార్న్ చేయాల్సి వచ్చింది. ప్రభుత్వం సంజాయిషీ చెప్పడానికి యత్నం చేసింది. పట్టువదలని విక్రమార్కుల్లాంటి రాజకీయకులున్నందున, చివరకు తర్జన భర్జనలకు అంతిమరూపమైన కమీషనొకదాన్ని నియమించడంతో ఆ రభస ముగిసింది.

శారద రభస తాలూకు వార్తను మరునాటి దినపత్రికలో చదువుతోంది. ఒక్కొక్క లైన్ను చదువుతుంటే కుర్చీలో మేనువాల్చిన తను ఊబిలోకి జారిపోతున్నట్టనిపించింది. ముందు లైన్లను ఇక చదవలేకపోయింది. కళ్లల్లో నీరు నిండుకుపోవడంతో అక్షరాలు సరిగ్గా కనిపించలేదు. పిచ్చిదానిలా తలపట్టుకుని "లేదు, నా పాప నడవగలుగుతుంది, కాళ్లకేం కాదు, పరుగెత్తుతుంది, డ్యాన్సు చేస్తుంది" అంటూ గట్టిగా అరచింది. కేకకు జడిసి పాప నిద్రలోంచి లేచి ఒకే విధంగా ఏడుపు నందుకుంది. ఒళ్లో పడి వున్న దినపత్రికలోని వార్తపై కన్నీళ్లు పడి అక్షరాలు తడిసి బరువెక్కాయి!

కోట్లు గడిస్తున్న ఓ పెద్ద మందుల కంపెని విడుదల చేసిన పోలియో వాయిల్స్ స్టాకు అకస్మాత్తుగా చేపట్టిన ఎయిర్‌లైన్స్ సిబ్బంది స్ట్రైక్‌వల్ల నియమిత కాలంలో కాకుండా కొన్ని రోజుల తరువాత పొటెన్సి లేకుండా గ్రామీణ ప్రాంతాల్లో వున్న హాస్పిటళ్లకు చేరాయని, తోడుగా విపరీతమైన కరెంట్ కోత మరియు అస్తవ్యస్తంగా వున్న రిఫ్రిజిరేషన్ వ్యవస్థల మూలంగా, గత సంవత్సరం నుంచి పొటెన్సి లేని పోలియో చుక్కలనే పిల్లలకు వాడుతున్నారని ముఖ్యంగా ఈ అమానుషం స్టాకు బ్యాచ్ నంబర్ల ప్రకారంగా రెండు జిల్లాల్లో విస్తృతంగా జరిగిందని ఆ వార్తా సారాంశం!

శారదకు పాపకు వేయించిన చుక్కలు ఆ అనంత చుక్కల్లోని అంతర్భాగమేనని బాగా అర్థమయింది. ఏడుపు విని మంచంలో వున్న పాప దగ్గరికి పరుగెత్తింది శారద. పాప కాళ్లు–చేతులు గాలిలో ఆడిస్తూ ఏడుస్తూనే వుంది. శారద పాపను ఎత్తుకోడానికి చేతులు చాచి ముందుకు వంగింది. పాప కాళ్లకున్న వెండిపట్టీల చిరుగజ్జెల చప్పుడు శారదకు ఏమాత్రం వినిపించడంలేదు.

◆



## బడలిన కడలి

కడలి అలల కలాల్తో చరిత్ర రాస్తోంది
నత్తగుల్లల్ని యిసుక చేతుల్లో తిప్పగా తిప్పగా
ఎక్కడో ఓ కొలికిపూస మెరుస్తుంది
సత్యం ముత్యపు చిప్పలు విప్పుకున్న వైనం రాసినా
చితికిన పిచ్చుక గూళ్ళు బతుకుల్లో దైన్యం దాచినా
చరిత్ర పంక్తుల మధ్య చిలిపి లిపి
చదివి నవ్వుకుంటుంది ధరిత్రి
తనే ఆఖరు దాన్ననుకునే ప్రతి తుపానూ
తప్పక తప్పుకోవలసిందే!
భీభత్స క్షేత్రంలో నించి
పిలకలు పుట్టుకు రావలసిందే!
రాత్రి కలడి ఘూర్ణిల్లుతూ
తలబాదుకున్న తీరాలు
తెల్లారేసరికి ధరణి
తలదాల్చుకున్న వేదాలు
ఎన్నిసార్లు చరిత్ర తిరగరాసినా
ఎప్పుడూ ఆశ్చర్యమే కడలికి
దీపాలూ, ద్వీపాలూ
తిరునాళ్లలా సాగిపోతున్నా
చెయ్యాపడమే తప్ప
చెయ్యగలిగింది లేక!

— 'విశాపతి'

